## క్లుప్తంగా

### ఐఏబీ సమావేశంపై జాప్యం తగదు


మెట్టు గోవిందరెడ్డి, సమన్వయకర్త

**రాయదుర్గం:** తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్ఎల్సీ) ద్వారా ఆయకట్టుకు సాగు నీరందించడంపై కొన సాగుతున్న జాప్యం సరైందికాదని రాయదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త మెట్టు గోవిందరెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడారు. అధికారులు, పాలకుల నిర్లక్ష్యం కారణంగా చెంతనే నీరున్నా .. రైతుకు చింత తీరడం లేదని విమర్శించారు. ఐఏబీ (సాగునీటి సలహా మండలి) సమావేశం నిర్వహించి ఉప కాలువలకు ఎక్కడిదాక నీరిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. తరచూ సమావేశాలు వాయిదా వేయడం పద్ధతిగా లేదన్నారు. గురువారం తప్పక జరుగుతుందని, రైతులంతా ఎదురుచూస్తే తీరా నిరాశ పరిచారని ధ్వజమెత్తారు. ఖరీఫ్ సీజన్ ముగిసే సమయం వచ్చినా నీటి విడుదల విషయంలో దాగుడు మూతలు ఏంటని ప్రశ్నించారు. దేశానికి అన్నం పెట్టే రైతుకు సహాయం చేయడంలో ఎన్ని పనులున్నా ముందుండాలని హితవు పలికారు. కణేకల్లు, బొమ్మనహాళ్, డీ హీరేహాళ్ మండలాల్లోని చివరి ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరందించేలా అధికారులు ప్రణాళికలు చేపట్టాలని కోరారు. రైతుల తరఫున జిల్లా కలెక్టర్‌ను కలసి త్వరలో ఐఏబీ సమావేశం నిర్వహించేలా విజ్ఞప్తి చేస్తామన్నారు.

### ముద్దలాపురం చెరువుకు హంద్రీనీవా జలాలు


మరువ పారుతున్న ముద్దలాపురం చెరువు

**కూడేరు:** మండలంలోని ముద్దలాపురం చెరువు నీటితో కళకళలాడుతోంది. పి.నారాయణపురం గ్రామం వద్ద వెళ్లిన హంద్రీ నీవా కాలువ నుంచి చోళసముద్రం మీదుగా పిల్ల కాలువ ద్వారా ముద్దలాపురం చెరువులోకి చేరుతోంది. చెరువు కృష్ణా జలాలతో నిండి మరువ పారుతోంది. చెరువులో నీరుంటే భూగర్భ జలాలు పెరుగుతాయని, వేలాది ఎకరాలకు సాగు నీరు అందుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### ఎర్రగుంట జయన్నకు సేవారత్న పురస్కారం

**కుందుర్పి:** మండలంలోని ఎర్రగుంటకు చెందిన జయన్నకు హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం వారు సేవారత్న పురస్కారాన్ని అందించారు. జయన్న గత 17 ఏళ్లుగా గుంతకల్లులో పేద విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ ఇస్తూనే మరోవైపు పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గత బుధవారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాల్లో వివిధ సేవా రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న వారికి పురస్కారాలు అందించారు. జయన్నకు రిటైర్డ్ జడ్జి రామచంద్రయ్య,హైదరాబాద్ అదనపు కలెక్టర్ వెంకటాచారి, కంటోన్మెంట్ ఎమ్మెల్యే గద్దర్ కుమార్తె వెన్నెలమ్మ, జాతీయ వినియోగదారుల మండలి కేంద్ర సంస్థ ఉప సంచాలకులు మాదయ్య పురస్కారాన్ని అందించారు.

### 11 గంటల్లో 15 ఎకరాల్లో గుంటక పాసిన రైతు


నాగరాజును అభినందిస్తున్న గ్రామస్తులు

**బొమ్మనహాళ్:** మండలంలోని గోవిందవాడకు చెందిన రైతు గోడ నాగరాజు అరుదైన రికార్డు సృష్టించాడు. కేవలం 11 గంటల్లో 15 ఎకరాల్లో బాడుగ గుంటకతో పొలాన్ని, పాసి అందరిచేత శభాష్ అనిపించుకున్నాడు. గురువారం తారకాపురం గ్రామానికి చెందిన మోదిన్ బాషాకు చెందిన పొలంలో గుంటకపాశాడు. ఉదయం 6 గంటలకు మొదలుపెట్టి, సాయంత్రం 4 గంటలకు పూర్తిచేశాడు. గ్రామస్తులు రైతు గోడ నాగరాజు, ఎద్దులను సన్మానించారు.

### ఆర్‌సీహెచ్‌లో అన్ని వివరాలు పక్కాగా ఉండాలి


ఆర్‌సీహెచ్ నమోదుపై వివరిస్తున్న డీపీఎంఓ

**కణేకల్లు:** ఆర్‌సీహెచ్ పోర్టల్‌తోపాటు బుక్‌లో గర్భిణులు, బాలింతల పరీక్షల వివరాలు పక్కాగా నమోదు చేయాలని డీపీఎంఓ రవిశంకర్ తెలిపారు. గురువారం మండలంలోని మాల్యం గ్రామంలో ఆర్‌సీహెచ్ పరిశీలన జరిగింది. ముందుగా 12 మంది గర్భిణులను వెల్‌నెస్ సెంటర్‌కు పిలిపించి, వారి వద్ద ఉన్న ఆర్‌సీహెచ్ బుక్‌లను పరిశీలించారు. డీపీహెచ్ఎన్ఓలు హేమలత, జరీనాలతో కలిసి డీపీఎంఓ ఆర్‌సీహెచ్ రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో డీపీఎంఓ మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రమనోహర్, సీహెచ్ఓ సుజాత, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశాలు పాల్గొన్నారు.

# నైపుణ్య విద్యపై అనాసక్తి

**పాలిటెక్నిక్ కళాశాలకు విద్యార్థులు కరువు**
- జీన్స్ ఖిల్లాగా 'దుర్గం' ఖ్యాతి .. టెక్స్‌టైల్స్ కోర్సుకు ఆదరణలేదు..
- కంప్యూటర్, ఈసీఈ కోర్సులకు డిమాండ్
- రూ.కోట్లు ఖర్చుచేసి నిరుపయోగంగా వదిలేసిన కళాశాల గదులు


పాలిటెక్నిక్ కళాశాల అడ్మిషన్ భవనం



తలుపులు తెరుచుకోని కళాశాల భవనం

**రాయదుర్గం:** సాధారణ కోర్సుల కంటే సాంకేతిక కోర్సులకు ఆదరణ ఉంటుంది. త్వరగా స్థిరపడే అవకాశం ఉంటుంది. పైసా ఖర్చులేకుండా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ద్వారా ఈ అవకాశం పొందొచ్చు. అయితే ప్రచార లోపంతో జీన్స్ ఖిల్లాగా పేరొందిన దుర్గం పాలిటెక్నిక్ కళాశాలలో చేరేవారు లేరు. ఫలితంగా విద్యార్థుల కొరత కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. కనీసం టెక్స్‌టైల్స్ కోర్సుకు కూడా ఆదరణ లేదు. ఉంటే తమకేం? మూతపడితే నష్టమేమి? వచ్చే జీతాలేమీ ఆగవు కదా? అన్నట్టు కొందరు సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది.

పట్టణంలోని శాంతినగర్ పైభాగన కొండప్రాంతానికి ఆనుకొని 2008–09లో పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటైంది. ఇక్కడ సివిల్, మెకానికల్ కోర్సులను ప్రవేశపెట్టారు. ప్రతి కోర్సుకు 60 మంది విద్యార్థులను నిర్దేశించారు. తొలి ఐదేళ్లు సరిపడేంత సంఖ్యలో విద్యార్థులు కళాశాలకు హాజరయ్యారు. ఆ తర్వాత క్రమేణా తగ్గుముఖం పట్టారు. ప్రారంభం నుంచి నేటి వరకు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాళ్లతోనే నెట్టుకొచ్చారు. వారు దృష్టి సారించక పోవడం .. టెక్నికల్ కోర్సుల పట్ల ప్రచారం కొరవడడంతో విద్యార్థుల సంఖ్య సింగిల్ డిజిట్‌కే పరిమితమైంది.

**పాలిటెక్నిక్ కళాశాలలో కోర్సులు, ప్రవేశాలు ఇలా..**

| కోర్సు | 2021-22 | 2022-23 | 2023-24 | 2024-25 |
| --- | --- | --- | --- | --- |
| సివిల్ | 15 | 04 | 00 | 05 |
| మెకానికల్ | 35 | 12 | 21 | 15 |
| మొత్తం | 50 | 16 | 21 | 20 |

2024–25వ అకాడమీ సివిల్ కోర్సుకు ఐదుగురు, మెకానికల్ కోర్సులో 15 మంది మాత్రమే చేరారు. వారికి తోడు మరో 18 మంది మెకానికల్ కోర్సులో రెండు ఏడాది చదువుతున్నారు. ప్రస్తుతం కళాశాలలో రెండు కోర్సులు, రెండేళ్ల నుంచి 38 మంది మాత్రమే ఉన్నారు. 11 మంది అధ్యాపకులు బోధిస్తున్నారు. మిగిలిన వివిధ విభాగాల్లో మరో సుమారు 16 మంది విధుల్లో ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ.కోట్లు ఖర్చుచేసి కావాల్సినన్ని గదులు, పరికరాలు, మౌలిక సౌకర్యాలు కల్పించినా, వినియోగించేవారు కరువయ్యారు. ఫలితంగా కొన్ని గదులు పాడుబడి మూతపడే స్థితికి చేరాయి.

**జీన్స్ ఖిల్లాగా దుర్గం**

కర్ణాటక సరిహద్దునున్న రాయదుర్గం అంటేనే జీన్స్ ఫ్యాంట్ల తయారీకి ప్రసిద్ధి. దేశంలోని పలు రాష్ట్రాలకు ఇక్కడి నుంచే ప్యాంట్లు ఎగుమతి అవుతోంది. రూ.కోట్లలోనే వ్యాపారం జరుగుతోంది. ఇంతటి ప్రావీణ్యం కలిగిన చోట టెక్స్‌టైల్స్ ఇంజనీరింగ్ కోర్సు ప్రవేశపెట్టలేదు. మడకశిరలో ఉన్నా అక్కడ పెద్దగా వినియోగించుకునే వారు లేరు. వీటికి తోడు కంప్యూటర్, ఈసీఈ కోర్సులకు డిమాండ్ ఏర్పడింది. పాలకులు, అధికారులు చిత్తశుద్ధితో ఆలోచించి డిమాండ్ కోర్సులు అందుబాటులోకి తెచ్చేలా కృషి చేయాలి. కళాశాలలో నాలుగు కోర్సులకు అవకాశం కల్పించే సదుపాయం ఉంది.

**దారికోసం అవస్థలు....**

కళాశాల ఏర్పాటు సమయంలో అవగాహన లోపంతో విద్యార్థులు, అధ్యాపకులకు శాపంగా మారింది. రూ.కోట్లు ఖర్చుచేసి భవనాలు, ఇతర సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చినా దారి లేక అవస్థలు పడాల్సి వస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొలిక్కి తెచ్చింది. మార్గం సుగమం చేసేలా కార్యచరణ చేపట్టింది. కొలతలు తీసి దారి ఏర్పాటుకు సిద్ధం చేసింది. అంతలోనే కూటమి ప్రభుత్వం అధికారం లోకి రావడంతో ఆ సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. ఈ ప్రధాన సమస్య పరిష్కారానికి కృషి చేయాలని విద్యార్థులు, అధ్యాపకులు కోరుతున్నారు.

**అవగాహన కల్పిస్తున్నాం**



ఏటా నైపుణ్య విద్యపై అవగాహన కల్పిస్తున్నాం. సివిల్, మెకానికల్ కోర్సులపై ఆసక్తి తగ్గింది. కంప్యూటర్, ఈసీఈ, టెక్స్‌టైల్స్ కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు దృష్టి సారిస్తున్నారు. వాటి అనుమతి కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నైపుణ్య విద్యపై ఆసక్తి పెంచుకుంటే అనుకున్న స్థాయిలో స్థిరపడొచ్చు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అవగాహన పెంచుకోవాలి. కనీసం 60 మంది ఉంటే హాస్టల్ వసతి అందుబాటులోకి తేవొచ్చు. అడ్మిషన్లు పెంచేలా దృష్టి సారిస్తాం.

– ఎం. శ్రీనివాసులు, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్, రాయదుర్గం

## అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం


కొత్తూరులో వైఎస్సార్‌సీపీ కార్యకర్త కర్రబజ్జి ఫొటోకు నివాళులర్పిస్తున్న తలారి రంగయ్య

**కళ్యాణదుర్గం రూరల్:** అధైర్య పడకండి.. అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ కార్యకర్త కర్రబజ్జి కుటుంబ సభ్యులకు మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య భరోసా ఇచ్చారు. గురువారం మండలంలోని కొత్తూరు గ్రామంలో ఇటీవల అనారోగ్య సమస్యలతో వైఎస్సార్‌సీపీ నాయకుడు కర్రబజ్జి మృతిచెందాడు. కర్రబజ్జి కుటుంబాన్ని మాజీ ఎంపీ తలారి రంగయ్య పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, కొత్తూరు బాబు, నారాయణపురం వెంకటేశులు, హనుమంతరెడ్డి, షేక్షావలి, జాని, నాయకులు పాల్గొన్నారు.

**శుభకార్యం**

**కళ్యాణదుర్గం రూరల్:** పట్టణంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పాండు అల్లుడు రమేష్, భారతి వివాహ వేడుకలో కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య పాల్గొన్నారు. ఈసందర్భంగా వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, నారాయణపురం వెంకటేశులు, హనుమంతరెడ్డి, షేక్షావలి, దీపు, జానీ పాల్గొన్నారు.

## లైన్‌మెన్ ఆత్మహత్యకు కారణం వేధింపులే


మాట్లాడుతున్న ఎస్సీ,ఎస్టీ జేఏసీ నాయకులు

**కంబదూరు:** ఉన్నతాధికారుల వేధింపుల వల్లనే తిమ్మాపురం లైన్‌మెన్ రామాంజనేయులు ఆత్మహత్య చేసుకున్నాడని, అందుకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ,ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. గురువారం రామాంజనేయులు భౌతికకాయాన్ని సాకే హరి సందర్శించి, నివాళులర్పించారు. అనంతరం సాకే హరి మాట్లాడుతూ ఇటీవల కాలంలో అకారణంగా కిందిస్థాయి ఉద్యోగులపై ఉన్నతాధికారులు నిత్యం వేధింపులకు గురి చేస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. రామాంజనేయులు కూడా ఉన్నతాధికారుల వేధింపుల వల్లనే ఆత్మహత్య చేసుకున్నాడని, దీనిపై సమగ్రమైన విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు చెలిమప్ప, మారెన్న, నారాయణ, రామచంద్ర, గంగన్న, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

**భూ సమస్యలను పరిష్కరించండి**

**కళ్యాణదుర్గం:** నియోజకవర్గంలో నెలకొన్న ఎస్సీ,ఎస్టీ భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్సీ,ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి కోరారు. గురువారం కళ్యాణదుర్గంలోని ఆర్డీఓ కార్యాలయంలో భూబాధితులతో కలిసి ఆర్డీఓ డాక్టర్ రాణీసుస్మితను కలిసి పలు సమస్యలపై విన్నవించారు. బెళుగుప్ప, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం రూరల్, కంబదూరు మండలాల్లో అనేక భూ సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కొందరు దౌర్జన్యంగా దళితల భూములను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు చెలిమప్ప, నారాయణ, మారెన్న, రామచంద్ర, గంగన్న, నారాయణస్వామి, పాల్గొన్నారు.

## రేషన్ పంపిణీకి రాజకీయ గ్రహణం

**రాయదుర్గంటౌన్:** పేదల బియ్యం పంపిణీకి రాజకీయ గ్రహణం పట్టుకుంది. మండలంలోని వడ్రవన్నూరు గ్రామంలో నేటికీ చౌకధాన్యపు డిపో ద్వారాల లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేయలేదు. దాదాపు 12 రోజుల నుంచి 465 మంది లబ్ధిదారులకు 80 క్వింటాళ్ల బియ్యం అందకపోయినా అధికారులు పట్టించుకోలేదు. టీడీపీ అధికారంలోకొచ్చాక ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతి పరులకు చౌకధాన్యపు డిపో డీలర్లు, మధ్యాహ్న భోజన ఏజెన్సీలను కట్టబెట్టారు. ఇదే క్రమంలో గ్రామంలో ఈ నెల బియ్యం కోటా ఇప్పటి దాకా డీలర్‌గా ఉన్న సువర్ణమ్మ స్టోరు వద్ద కాకుండా రేషన్ బియ్యాన్ని టీడీపీ సానుభూతి పరుల ఇంటి వద్ద దింపినట్లు సమాచారం. గ్రామంలో బియ్యం అందుబాటులో ఉన్నా లబ్ధిదారులకు అందకపోవడంతో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రస్తుతం డీలర్ తక్షణం రాజీనామా చేయాలని అధికారుల నుంచి తీవ్ర ఒత్తిడి వస్తున్నట్లు తెలిసింది. డీపో డీలర్ సువర్ణమ్మ సోదరుడు అరుణకుమార్‌ను విచారించగా, సెప్టెంబర్ నెల కోటా బియ్యం తమకు సరఫరా చేయకపోవడంతో పంపిణీ చేయలేదన్నారు. ఈ విషయమై డిప్యూటీ తహసీల్దార్ రఘును అడగ్గా, డీలర్ అందుబాటులో లేకపోవడంతో జాప్యం జరిగిందని, శుక్రవారం నుంచి పంపిణీ ప్రారంభిస్తామన్నారు.

### సీతారాం ఏచూరి మరణం తీరనిలోటు

**ఉరవకొండ:** వామపక్ష యోధుడు, సీపీఎం జాతీయ నేత సీతారాం ఏచూరి మృతి తీవ్ర బాధాకరమని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి గురువారం అన్నారు. విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ సీపీఎం జాతీయ నాయకుడు సీతారాం ఏచూరికి అనంతపురం జిల్లాతో చాలా అనుబంధం ఉందన్నారు. జిల్లాలో జరిగిన అనేక పోరాటాల్లో సీతారాం ఏచూరి పాల్గొన్నట్లు గుర్తుచేశారు. 2004లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తన విజయానికి ప్రత్యక్షంగా పాల్గొని కృషి చేశారన్నారు. విద్యార్థి దశ నుంచే సీతారాం ఏచూరి జాతీయ రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించారని తెలిపారు. కార్మిక లోకానికి , లౌకిక వాదానికి ఏచూరి మరణం తీరని లోటు అన్నారు.

### ఆగిన వినాయకుడి విగ్రహ ఊరేగింపు

**రాయదుర్గం:** పట్టణంలోని బళ్లారి రోడ్డు గంగమ్మబావి నుంచి వైభవంగా మొదలైన వినాయకుడి (నిమజ్జనం) ఊరేగింపు అర్ధాంతరంగా ఆగింది. బుధవారం అర్ధరాత్రి దాటాక స్థానిక వినాయక సర్కిల్ వద్దకు వినాయకుడి విగ్రహాన్ని ఊరేగిస్తుండగా, అర్బన్ సీఐ జయనాయక్ సిబ్బందితో కలిసి అడ్డుకున్నారు. సార్.. ఉత్సవాలకు ఎంతో ఖర్చుపెట్టుకున్నాం? ఎందుకు ఆటంకం కలిగిస్తున్నారని కొందరు ప్రశ్నిస్తే?.. డీజే సౌండ్ ఎక్కువగా ఉందని, ఓబుళాచారి రోడ్డులో వెళ్లకుండా నేరుగా లక్ష్మీబజారు వైపు మాత్రమే వెళ్లాలని ఆదేశించినట్టు చెప్పారు. దీంతో వేలాది మంది భక్తులు నిరుత్సాహానికి గురై అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీనిపై పలు విమర్శలు వచ్చాయి.

### భూమి కోసం.. నీటి కోసం

- ఓబుళవారి పల్లి నుంచి గోవాకు
- అన్నమయ్య జిల్లా కుర్రాడు సైకిల్ యాత్ర


సైకిల్ యాత్రతో కళ్యాణ దుర్గం చేరిన శివశంకర్

**కళ్యాణదుర్గం:** సేవ్ వాటర్...సేవ్ ఎర్త్...ని నాదంతో ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు అన్నమయ్య జిల్లా ఓబుళవారిపల్లికి చెందిన శివ శంకర్ పలు రాష్ట్రాలు సైకిల్‌పై చుట్టేస్తున్నాడు. ఈ క్రమంలోనే గురువారం సైకిల్‌పై కళ్యాణదుర్గం చేరుకున్నాడు.ఈ నెల 4న ఇంటి నుంచి బయలుదేరినట్లు ఆయన చెప్పారు. ఇప్పటికే నార్త్ ఇండియా చుట్టివచ్చానని, కర్ణాటకలోని మురడేశ్వర్‌తో పాటు గోవా వరకు సైకిల్ యాత్ర చేపడుతున్నట్లు వివరించారు. సేవ్ వాటర్...సేవ్ ఎర్త్ గురించి ప్రజలకు తెలియజేస్తూ ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. తాను ఇంటర్ వరకు చదివి, తాపీ పని చేస్తూ కూడబెట్టుకున్న డబ్బుతో పర్యావరణంపై ఆసక్తితో సైకిల్ యాత్ర చేపట్టినట్లు వివరించారు.

### స్కూల్‌గేమ్స్‌లో ప్రతిభ


క్రీడాపోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు

**వజ్రకరూరు:** మండల కేంద్రంలోని కేవీజెడ్పీహెచ్ఎస్‌లో గురువారం జరిగిన మండల స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీల్లో చిన్నహోతూరు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ప్రతిభ చూపారు. ఖోఖో క్రీడా పోటీలో చిన్నహోతూరు విద్యార్థులు పాల్గొని, మొదటి స్థానంలో నిలిచినట్లు పీడీ ప్రభాకర్ తెలిపారు. 100 మీటర్ల పరుగు పందెంలో పాఠశాలకు చెందిన మల్లికార్జున ప్రథమ స్థానంలో నిలిచారు. రెండోస్థానంలో ధనుష్ అనే విద్యార్థి నిలిచినట్లు పీడీ తెలిపారు. 200 మీటర్ల పరుగు పందెంలో ధనుష్ ప్రథమ స్థానం, 400 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ మల్లికార్జున నిలిచాడు. రెండో స్థానంలో జ్యోతిరాం నిలిచాడు. షాట్‌ఫుట్ పోటీల్లో జ్యోతిరాం ద్వితీయ స్థానంలో నిలిచాడు. హెచ్ఎం బసవలింగప్ర సాద్, పీడీ ప్రభాకర్, ఉపాధ్యాయులు అభినందించారు.

### భారత సేవా రత్న అవార్డులకు ఇద్దరి ఎంపిక


సామాజిక సేవా కార్యకర్త బెంజ్‌మెన్


భారతసేవారత్న అవార్డుకు ఎంపికైన మల్లికార్జున

**వజ్రకరూరు:** మండలానికి చెందిన సామాజికసేవా కార్యకర్తలు బెంజ్‌మెన్, మల్లికార్జున భారత సేవారత్న, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అవార్డులకు ఎంపికయ్యారు. బెంగళూరు నగరానికి చెందిన సోమలరాజు ఫౌండేషన్ వారు వీరిని అవార్డులకు ఎంపిక చేశారు. ఈనెల 14న బెంగళూరులోని బీఆర్ అంబేడ్కర్ సముదాయ భవనంలో జరగబోవు కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ శివరాజు, ప్రముఖుల చేతులమీదుగా అవార్డులు అందుకోనున్నారు.

### వైభవంగా గణేష్ నిమజ్జనం


వినాయకుడిని ఊరేగిస్తున్న దృశ్యం

**విడపనకల్లు:** మండలంలోని గడేకల్లులో గణేష్ నిమజ్జనం గురువారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు, యువకులు పాల్గొని స్థానిక కెనాల్‌లో ఉత్సాహంగా నిమజ్జనం చేశారు.

### పార్టీ బలోపేతానికి కృషి చేయండి

**రాయదుర్గం:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థానికంగా మరింత బలోపేతం చేసేలా కేడర్ మొత్తం శక్తివంచన లేకుండా కృషి చేయాలని జిల్లా పార్టీ అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి దిశానిర్దేశం చేశారు. గురువారం డీ హీరేహాళ్ మండల కన్వీనర్ ఎం. వన్నూర్‌స్వామి ఆధ్వర్యంలో ఓబుళాపురం, కల్యం గ్రామాల సర్పంచులు వాల్మీకి మల్లికార్జున, వాల్మీకి నాగరాజు, కల్యం సురేష్, సురేష్‌యాదవ్‌తో కలిసి అనంతపురంలోని ఆయన స్వగృహంలో అనంతను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మెట్టు గోవిందరెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు పార్టీ బలోపేతంపై దృష్టి సారించి, ప్రజల పక్షాన పోరాటాలు సాగించాలని తెలిపారు.

### మహిళా సంఘాలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

**రాయదుర్గంటౌన్:** పొదుపు సంఘాల మహిళలు బ్యాంకు లింకేజీతో ఆర్థికాభివృద్ధి సాధించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప తెలిపారు. గురువారం పట్టణంలోని చౌడేశ్వరీదేవి కమ్యూనిటీ హాల్‌లో పట్టణ సమాఖ్య సమావేశం జరిగింది. సమావేశానికి హాజరైన సమైక్య లీడర్లతో చైర్‌పర్సన్ మాట్లాడారు. సకాలంలో బ్యాంకు లింకేజీ రుణాలు తీర్చడం, పొదుపు సక్రమంగా చేసుకోవడం లాంటి కార్యక్రమాలను చేసుకోవాలన్నారు. సంఘాల నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని, ఈ మేరకు సభ్యులకు సీవోలు స్పష్టమైన అవగాహన కల్పించాలన్నారు. సీవో సంధ్య, సమైక్య లీడర్లు పాల్గొన్నారు.

### గొర్రెలకు టీకా

**బెళుగుప్ప:** గొర్రెలకు నీలినాలుక నివారణ టీకా వేయించాలని పశువైద్యాధికారి రమేష్ తెలిపారు. గురువారం శ్రీరంగాపురం, గుండ్లపల్లి గ్రామాల్లోని గొర్రెల మందలను పరిశీలించి, వ్యాధి తీవ్రతను పరిశీలించి, 250 గొర్రెలకు నివారణ టీకాలు వేశామన్నారు. నరసాపురం, యలగలవంక గ్రామాల్లో పలు గేదెల్లో గర్భకోశ వ్యాధులను గుర్తించి, చికిత్సలు అందించామని పశువైద్యాధికారి తెలిపారు.

### పౌష్టికాహారం తీసుకోవాలి

**వజ్రకరూరు:** పౌష్టికాహారం తీసుకోవాలని, తద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చని వైద్యాధికారి తేజశ్వి అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. వైద్యాధికారిణి మాట్లాడుతూ నిత్యం మనం తీసుకునే ఆహారంలో ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు, మాంసకృతులు ఉండాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, ఆరోగ్య విస్తరణ అధికారి గురుప్రసాద్, సూపర్‌వైజర్లు నాగశంకర్, సుశీలమ్మ,హెల్త్ ఎడ్యుకేటర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

**పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం**

**బెళుగుప్ప:** గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సురేఖ తెలిపారు. గురువారం బెళుగుప్ప తండా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, బెళుగుప్పలోని నాలుగో నంబర్ కేంద్రాల్లో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయ మహిళా పోలీసు భాగ్యలక్ష్మి, ఏఎన్ఎం మౌనిక, అంగన్‌వాడీ వర్కర్‌లు,హెల్పర్‌లు తదితరులు పాల్గొన్నారు.

### క్రీడల్లోనూ రాణించాలి


ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణంలో వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

**బెళుగుప్ప:** విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని హెచ్ఎం వెంకటప్రసాద్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ నిర్వహించారు. మొత్తం 160 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, ఖోఖో, చెస్ పోటీల్లో విజేతలు ఈనెల 17న నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని హెచ్ఎంలు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు రాజశేఖర్, తిమ్మరాజు, రఘు, అనిత, నరేష్, హరి పాల్గొన్నారు.

### జీబీసీకి మరమ్మతులు

**విడపనకల్లు:** గుంతకల్లు బ్రాంచి కెనాల్ (జీబీసీ) మెయిన్ కెనాల్ నాల్గో కిలో మీటరు అండర్ టన్నెల్ వద్ద కోతకు గురైన సైడ్ వాల్ మరమ్మతులను జీబీసీ అధికారులు గురువారం చేయించారు. 4 మీటర్ల మేర మెయిన్ కెనాల్ పూర్తిగా కోతకు గురైంది. దీంతో అధికారులు రెండు రోజుల కిందటే హెచ్ఎల్సీ నీరు జీబీసీకి పూర్తిగా నిలుపుదల చేసి, కాంక్రీట్‌తో మరమ్మతులు చేయించారు. మరమ్మతుల పనులు రెండు రోజుల పడుతుందని జీబీసీ జేఈ పల్లవి తెలిపారు. అధికారుల తక్షణమే సాగునీరు సరఫరా చేసే విధంగా త్వరతగతిన పనులు పూర్తి చేసి జీబీసీకి నీరు పారించాలని రైతులు అధికారులను కోరుతున్నారు

## సంక్షిప్త సమాచారం

**తహసీల్దార్ లేక అవస్థలు**

**కూడేరు:** ఆర్థిక మంత్రి సొంత నియోజకవర్గంలోని కూడేరు మండలానికి రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కృష్ణమూర్తి అన్నారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. రెగ్యులర్ తహసీల్దార్ లేక సంతకాల కోసం విద్యార్థులు, ప్ర జలు, భూసమస్యలు పరిష్కారం కాక రైతు లు అవస్థలు పడుతున్నారన్నారు. పార్టీ నే తలు వెంకటేశ్వర్లు, కరీం, మల్లికార్జున, చిన్నా, వీరభద్రప్ప, ఆదినారాయణ పాల్గొన్నారు.

**స్వచ్ఛతాహి సేవా విజయవంతం చేద్దాం**

**గుమ్మఘట్ట:** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎంపీడీఓ నరసింహమూర్తి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 14 నుంచి అక్టోబర్ 2న గాంధీ జయంతి వరకు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సురేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

**17 నుంచి స్వచ్ఛతా హి సేవ**

**బొమ్మనహాళ్:** మండలంలోని ఈ నెల 17వ తేదీ నుంచి స్వచ్ఛత హి సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ షకీలాబేగం , ఈఓపీఆర్‌డీ దాస్ తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈనెల 17 నుంచి స్వచ్ఛతా హి సేవా జరుగుతుందన్నారు.

**కూడేరు:** 'స్వచ్ఛతా హి సేవ' కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని ఎంపీడీఓ విజయలలిత ఆదేశించారు. గురువారం ఎంపీడీఓ తన చాంబర్‌లో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమ నిర్వాహణపై సిబ్బందితో సమావేశమం నిర్వహించారు. ఈఓఆర్డీ లక్ష్మీనరసమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఫాతిమా, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

**సమయపాలన పాటించని ఉద్యోగులు**

**గుమ్మఘట్ట:** గ్రామ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించడంలేదు. మండలంలోని పూలకుంట గ్రామ సచివాలయ సిబ్బంది ఉదయం 10 గంటలకు హాజరు కావాల్సి ఉన్నా ఉదయం 10.50 అయినా విధులకు హాజరుకాలేదు. దీంతో సచివాలయానికి వివిధ పనులపై వచ్చిన ప్రజలు ఎదురుచూడాల్సి వచ్చింది.

**ప్రతి ఒక్కరూ శుభ్రత పాటించాలి**

**కుందుర్పి:** ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని, నాణ్యమైన ఆహారం తీసుకోవాలని డాక్టర్లు అనూషా,చాంద్ బేగం సూచించారు. మలయనూరు,బసాపురం పంచాయతీల్లో మారెమ్మ జాతర జరిగింది. గ్రామాల ప్రజలు జాతర సందర్భంగా మిగిలిన మాంసాన్ని ఎండబెట్టి ఇళ్లలో నిల్వ ఉంచారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలకు పరిశుభ్రత, ఆహార నాణ్యతపై ఆశా వర్కర్లు, సిబ్బంది, వైద్యులు బుధవారం మలయనూరు, వడ్డేపాళ్యం గ్రామాలకు వెళ్లి పరిశీలించారు.

**గుండెపోటుతో వివాహిత మృతి**

**కళ్యాణదుర్గం రూరల్:** గుండె పోటుతో వివాహిత భారతి (28) గురువారం మృతిచెందింది. మండలంలోని మంగళకుంటకు చెందిన వన్నూరుస్వామి భారతి దంపతులు కూలి పనులు చేస్తుండేవారు. వీరికి కూతురు తనుశ్రీ ఉంది. గురువారం కూలీలతో పాటు భారతి కూలీ పనులకు వెళ్లింది. పొలం పనులు చేస్తున్న సమయంలో గుండెపోటుకు గురైంది. డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించగా, అప్పటికే ఆమె మృతిచెందింది. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.